సాక్షి
బాపట్ల
మంగళవారం । 10 । డిసెంబర్ । 2024



శరవేగంగా ఆలయ నిర్మాణం

చెరుకుపల్లి: ఆరుంబాక గ్రామంలోని నెల్లెమ్మ తల్లి ఆలయాన్ని సుమారు రూ.1.25 కోట్లతో పునర్నిర్మాణం చేస్తున్నారు. ఫిబ్రవరి 7న ఆలయ ప్రతిష్ఠ చేస్తారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 584.00 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 8,298 క్యూసెక్కులు విడుదలవుతోంది.

జలపాలేశ్వరుడికి పూజలు



ఫిరంగిపురం: వేములూరిపాడు గ్రామంలోని జలపాలేశ్వర స్వామికి సోమవారం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

న్యూస్‌రీల్

వినూత్న వ్యవసాయంలో స్వర్ణ రైతులు



కారంచేడు: నూతన వ్యవసాయ పద్ధతులతో సాగును చేపట్టేందుకు రైతన్నలు ఎప్పుడూ ముందంటారు. అలాంటి వ్యవసాయ సాంకేతికతను అందిపుచ్చుకుంటూ కారంచేడు మండలం స్వర్ణ రైతులు ముందుకు దూసుకెళ్తున్నారు. స్వర్ణ గ్రామానికి చెందిన నీరుకట్టు రాంబాబు అనే రైతు సుమారు రూ.11 లక్షల విలువైన డ్రోన్, జనరేటర్, వాహనం ఎరువులను చల్లే యంత్రాలను కొనుగోలు చేశాడు. గ్రామంలోని అవని ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీఓ) సభ్యులతో ఆయన ఈ డ్రోన్‌ను సోమవారం ప్రారంభించారు. ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, వ్యవసాయాధికారుల సహకారంతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ డ్రోన్ సహకారంతో మెట్ట, మాగాణి పొలాల్లో ఎరువులు, యూరియా, కాంప్లెక్స్ ఎరువులను సమపాళ్లలో చల్లుకొనే విధంగా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బురదలో దిగే అవసరం లేకుండా ఈ డ్రోన్ వ్యవస్థ రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని వారు తెలిపారు. రైతులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై 6-ఏ కేసు నమోదు

చీరాల టౌన్: బాపట్ల జిల్లా తోటవారిపాలెం గ్రామానికి చెందిన 14 నంబర్ రేషన్ డీలర్ అక్రమాలకు పాల్పడుతున్నారనే సమాచారంపై సోమవారం 6-ఏ కేసు నమోదు చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గీతారాణి తెలిపారు. పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యం కార్డుదారులకు ఇవ్వకుండా కొనుగోలు చేయడంతోపాటుగా 11 క్వింటాళ్ల రేషన్ బియ్యం తేడా ఉండటంతో డీలర్‌పై 6-ఏ కేసు నమోదు చేశామని డీటీ తెలిపారు.

బీఎస్సీ అగ్రి కమ్యూనిటీ సైన్స్ ఎన్‌ఆర్‌ఐ కోటా స్పాట్ అడ్మిషన్స్

గుంటూరురూరల్: ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాల్లో బీఎస్సీ అగ్రికల్చర్(హానర్స్) కమ్యూనిటీ సైన్స్ ఎన్ఆర్ఐ కోటాలో స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీనుంచి 13వ తేదీ వరకూ విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆఫీస్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్ లాంఫాం నందు ఉదయం 10 గంటనుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహిస్తారని వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్స్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

పాపం పసివాడు

మహిళా ప్రాంగణంలో వదిలేసి వెళ్లిన వైనం



లక్ష్మీపురం: జిల్లా కలెక్టర్ బంగ్లా రోడ్డులోని మహిళా ప్రాంగణంలో రెండు సంవత్సరాల వయస్సున్న బాలుడిని వదిలి వెళ్లిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహిళా ప్రాంగణంలో రెండేళ్ల బాలుడిని గుర్తు తెలియని యువకులు వదిలి వెళ్లారు. బాలుడిని గమనించిన ప్రాంగణం నిర్వాహకులు నగరంపాలెం పోలీసులకు అప్పగించారు. వారు బాలుడితో మాట్లాడేందుకు ప్రయత్నించినా మాట్లాడలేదు. బిత్తర చూపులు చూస్తున్నాడు. బాలుడు గురించి ఆచూకీ తెలిసిన వారు నగరంపాలెం పోలీస్ స్టేషన్ 0863- 2234047 లేదా నగరంపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ 8688831336 నంబర్లకు సమాచారం తెలియజేయాలని కోరారు.

14, 15 తేదీల్లో జాతీయ ఎస్సీ కమిషన్ సమావేశాలు

గుంటూరుమెడికల్: విజయవాడలో ఈనెల 14, 15 తేదీల్లో ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర కార్యదర్శి దర్శనపు శ్రీనివాస్ సోమవారం తెలిపారు. తొలిరోజు విజయవాడలోని సిద్ధార్థ అకాడమీ, రెండో రోజు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ భవనంలో ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా, అతిథులుగా సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ కె.శ్యామ్ ప్రసాద్, సమరసత సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు తాళ్లూరి విష్ణువు, ఎస్సీ,ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, విశ్రాంత ఐఏఎస్ డాక్టర్ పరశురామ్, రాష్ట్ర అధ్యక్షుడు జి.సుబ్బయ్య హాజరవుతారని వెల్లడించారు.

అభాగ్యులపై కొరడా

ఝులిపించన్

- పైలెట్ ప్రాజెక్టుగా గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వేజెండ్ల ఎంపిక
- ప్రత్యేక బృందాలతో ఇంటింటి పరిశీలన
- ఆరు పాయింట్లతో విచారణ
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటికే ఏడు వేల పింఛన్ల కోత
- తాజా పరిణామాలతో ఆందోళన చెందుతున్న పెన్షనర్లు

పింఛన్ల వెరిఫికేషన్ ప్రారంభం



వేజండ్ల-2 గ్రామ సచివాలయం పరిధిలో వెరిఫికేషన్ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ టి. విజయలక్ష్మి, తెనాలి డీఎల్‌పీవో శ్రీదేవి తదితరులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/ చేబ్రోలు: పండుటాకులపై ప్రతాపం చూపించడానికి కూటమి ప్రభుత్వం సన్నద్ధమైంది. పింఛన్ల కోత మొదలెట్టింది. వెరిఫికేషన్ పేరుతో తొలగించే ప్రయత్నాలు ప్రారంభించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ ఐదు నెలల్లో జిల్లావ్యాప్తంగా 6,798 పింఛన్లు వివిధ పేర్లతో తొలగించారు. తాజాగా పైలెట్ వెరిఫికేషన్ పేరుతో ప్రతి జిల్లాలో ఒక సచివాలయం పరిధిలో తనిఖీ చేశారు. పింఛన్‌దారుల పూర్తి వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నప్పటికీ మరోసారి వారి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేశారు. ఆరు అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ వివరాలు సేకరించారు.

వివరాలను కూపీ లాగుతున్న అధికారులు

ప్రభుత్వం సేకరిస్తున్న వివరాలు గమనిస్తే పూర్తిగా పింఛన్లు కోత విధించడంపైనే దృష్టి పెట్టినట్లు ఉందని అధికారులు బాహాటంగానే చెబుతున్నారు. పింఛన్ దారులకు ఎంత సాగు భూమి ఉంది, అందులో మాగాణి ఎంత ? మెట్ట ఎంత ఉందనే వివరాలు సేకరిస్తున్నారు. పింఛన్‌దారుడు గతంలో ఏ పని చేసేవాడు..ప్రభుత్వ ఉద్యోగమా? ప్రైవేటు ఉద్యోగమా? అనే వివరాలతో పాటు వారికి ప్రతి నెలా కరెంట్ బిల్లు ఎంత వస్తోంది పరిశీలిస్తున్నారు. ఇంట్లో ఉన్న విద్యుత్ పరికరాల తనిఖీతో పాటు ఆస్తి వివరాలను రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు చేస్తున్న పని, నెలకు ఎంత ఆదాయం వస్తుందనే వివరాలు కూడా సేకరిస్తున్నారు. ఇంట్లో వారికి ఉన్న ఆటోలు, కార్లు , లబ్ధిదారుని పేరుతో ఏం ఉన్నాయనేది పరిశీలిస్తున్నారు.

16 ప్రత్యేక బృందాలతో జల్లెడ



చేబ్రోలు మండలం వేజండ్ల-2 గ్రామ సచివాలయం పరిధిలో సోమవారం పింఛన్ వెరిఫికేషన్‌ను జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద మొదలు పెట్టారు. వేజండ్ల-2 సచివాలయం పరిధిలో 650 మంది లబ్ధిదారులు ఉన్నారు. పరిశీలనకుగాను తెనాలి డివిజన్ పరిధిలోని ఈవోపీఆర్డీలు, ఏవోలు, ఎంఈవోలు, సచివాలయ సిబ్బందితో 16 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఒక్కో బృందానికి ఇద్దరు సభ్యుల చొప్పున పరిశీలన చేపట్టారు. లబ్ధిదారుల నుంచి వివిధ అంశాలను యాప్‌లో నమోదు చేసుకున్నారు. ఫొటోలను సేకరించారు. వెరిఫికేషన్ ప్రక్రియను డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి. విజయలక్ష్మి, తెనాలి డీఎల్‌పీవో శ్రీదేవి పర్యవేక్షించారు. గ్రామంలో ప్రత్యేక బృందాలు ఇంటింటికీ తిరిగి వివరాలను నమోదు చేసుకుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందారు.

పూనూరులో పెన్షన్.. టెన్షన్



పూనూరులో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

యద్దనపూడి: పింఛనుదారులు ఊహించిన విధంగానే పింఛన్‌లు పెద్ద ఎత్తున ఏరివేసేందుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. అందులో భాగంగానే మొదటి విడత పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా జిల్లాలోని యద్దనపూడి మండలం పూనూరు గ్రామాన్ని ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం గ్రామంలోని సచివాలయం-2 పరిధిలోని 476 మంది పింఛనుదారులను తనిఖీ చేపట్టారు. డీఆర్‌డీఏ పీడీ పీ పద్మ ఆధ్వర్యంలో 11 టీంలు సచివాలయ పరిధిలోని ఇంటింటికి వెళ్లి సెర్ప్ రూపొందించిన ప్రత్యేక మొబైల్ యాప్‌లో లబ్ధిదారుల వివరాలకు సంబంధించి 13 అంశాల వివరాలను యాప్‌లో నమోదు చేశారు. ఈ నమోదులో మూడు ఎకరాల మాగాణి, 10 ఎకరాల మెట్ట భూమికి మించి ఉందా? లేదా? కుటుంబంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షన్‌దారులు ఉన్నారా? లేరా? విద్యుత్ వినియోగం 300 యూనిట్లు కంటే ఎక్కువగా ఉందా? లేదా? ఆదాయపు పన్ను కడుతున్నారా? లేదా? సొంత కారు ఏమైనా ఉందా? లేదా? అనే వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేశారు. తనిఖీల్లో దివ్యాంగులు, వితంతు పింఛనులపై దృష్టి సారించినట్లు అధికారుల ద్వారా తెలియవచ్చింది. ఈ సర్వే అనంతరం అనర్హులను గుర్తించి వారి అనర్హతకు సంబంధించి నోటీసులు అందజేసి 45 రోజుల్లో వారి పింఛనులు తొలగించనున్నట్లు అధికారుల సమా చారం. సర్వే అనంతరం అర్హులు, అనర్హులు జాబితాను గ్రామ సచివాలయాలలో ప్రదర్శించి గ్రామసభలు నిర్వహించి అభ్యంతరాలుంటే పరిశీలించి సరిచేస్తామని ఎంపీడీఓ మహ్మద్ అఖీబ్ జావెద్ తెలిపారు.

కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి సన్నాహాలు

అచ్చంపేట: మండల సరిహద్దులోని మాదిపాడు నుంచి ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాల వరకు కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణం ఆవశ్యకతను గుర్తించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2023లో అప్పటి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నేతృత్వంలో కార్యాచరణ చేపట్టింది. అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి కావలసిన రూ.65 కోట్ల నాబార్డు నిధులు మంజూరు చేసి క్రోసూరులో 2023 జూన్ 12న వర్చువల్‌గా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గుర్తించిన స్థలం వద్దే, మంజూరైన అవే నిధులతో పనులను కొనసాగించే ప్రక్రియలో ప్రస్తుతం అధికారులు నిమగ్నమయ్యారు. కృష్ణానదిలో 14 పిల్లర్స్ వేసి వంతెన నిర్మాణం పూర్తి చేసేందుకు కావలసి 13.35 ఎకరాల భూమిని సేకరించారు. పల్నాడు జిల్లా మాదిపాడు వైపు 4.45 ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాలవైపు 9 ఎకరాల భూమిని సేకరించారు. ప్రస్తుతం మాదిపాడు వైపు సేకరించిన భూమిని చదును చేసే పనులలో ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ శాఖాధికారులు, కాంట్రాక్టర్ కసరత్తు ప్రారంభిరచారు. మరో వారం, పది రోజులలో భూమి పూజ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.



మాదిపాడు కృష్ణా నది వద్ద ఘాట్‌రోడ్డు నిర్మాణానికి హద్దులు నిర్ణయానికి పాతిన జెండా

అర్జీల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు అందుకుంటున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ప్రజా సమస్యలపై వస్తున్న అర్జీలను తక్షణమే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికను జిల్లా కలెక్టర్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, వాటిని పి.జి.ఆర్.ఎస్‌లో నమోదు చేయాలని చెప్పారు. జిల్లా అధికారులు సంబంధిత శాఖల పరిధిలోని పనులను పూర్తిచేయటమే కాకుండా పూర్తయిన పనుల వివరాలు ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలన్నారు. పాఠశాల భవనాల మరమ్మతులు, మౌలిక వసతులు పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టర్‌కు విన్నవించారు. కొన్ని సమస్యలకు తక్షణమే పరిష్కార మార్గం చూపారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. జిల్లాలో ఐదేళ్ల లోపు వయస్సు పిల్లలందరికి ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రంలో నమోదు చేయాలని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 105 అర్జీలు వచ్చాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మావతి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస రావు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రాజ్ దిబోరా, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఉమా, ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ కృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి విలిమ్స్, గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్‌కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు జయప్రదం చేయండి

బాపట్ల: రెవెన్యూ సదస్సులు జయప్రదం అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అధికారులను ఆదేశించారు. పర్చూరు మండలంలో నిర్వహించే రెవెన్యూ సదస్సులపై సంబంధిత అధికారులతో సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు.పర్చూరు మండలం చిననందిపాడు గ్రామంలో జరిగే రెవెన్యూ సదస్సుకు రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పీ సిసోడియ హాజరవుతారన్నారు. సదస్సు నిర్వహణలో సమస్యలు రాకుండా అధికారులు పక్కా ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని అన్నారు. దస్త్రాలన్నీ సిద్ధంగా ఉంచాలన్నారు.

రెచ్చిపోయిన మృగాడు

- స్నేహితుడు తల్లిపై లైంగికదాడికి యత్నం
- అరగంట సేపు పెనుగులాడిన బాధితురాలు
- పలుచోట్ల గాయాలు
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



తెంపర్ల రామారావు (ఫైల్)

తాడేపల్లి రూరల్: మద్యం మత్తులో స్నేహితుడు తల్లిపై ఓ యువకుడు లైంగికదాడికి యత్నించిన సంఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. కొత్తూరుకు చెందిన బాధితురాలు (50) తన తల్లితో కలసి ఉంటోంది. సేకరించిన వివరాల ప్రకారం.. తాడేపల్లి పట్టణ పరిధిలో నివాసముండే తెంపర్ల రామారావు, బాధితురాలు కుమారుడు స్నేహితులు. రామారావు పలుమార్లు అతని ఇంటికి వెళ్లి అతడి తల్లితో పరిచయం ఏర్పరచుకున్నాడు. ఆమె చేసిన వంటలు తిని బాగున్నాయి అమ్మా ! అంటూ పొగిడేవాడు. ఈ చనువుతో రామారావు మనసులో దురుద్దేశం పెట్టుకుని సోమవారం తెల్లవారుజామున కొత్తూరులోని స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో అతడు ఇంట్లో లేడు. తలుపు తీయమని అడగడంతో తెలిసిన వ్యక్తి కదా అని అతని తల్లి తలుపు తీసింది. ఒక్కసారిగా రామారావు ఆమెను మంచంపై పడవేసి విచక్షణారహితంగా ప్రవర్తించాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో అరవొద్దు అంటూ ఆమె నోరు మూసి, దుస్తులను చించేందుకు ప్రయత్నించాడు. ఆ పెనుగులాటలో బాధితురాలికి పలుచోట్ల గాయాలయ్యాయి. చివరకు ఆమె అతడి నుంచి తప్పించుకుని పెద్ద పెద్దగా కేకలు వేస్తూ హెలిప్యాడ్ వరకు పరిగెత్తింది. ఆమె కేకలకు స్థానికులు రోడ్డుమీదకు రావడంతో రామారావు పరారయ్యాడు. బాధితురాలి బంధువులు రామారావు ఇంటికి వెళ్లి నిలదీయగా తమకు ఏమి తెలియదని సమాధానం చెప్పారు. దీంతో జరిగిన సంఘటనపై బాధితురాలు బంధువులతో కలసి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు రామారావును ఎట్టకేలకు గుర్తించారు. అతడు గతంలో కూడా ఇలాంటి ఘటనలకు పాల్పడినట్లు, స్థానికంగా ఉన్న రాజకీయ నాయకులతో సెటిల్‌మెంట్లు చేయించుకున్నట్లు సమాచారం. రామారావు తాడేపల్లిలో ఉన్న పలువురు జేబుదొంగల వెంట తిరిగి వారికి సహాయ సహకారాలు అందిస్తున్నాడని పలువురు తెలియజేశారు. రామారావు లాంటి వారిని కఠినంగా శిక్షించాలని బాధిత మహిళ బంధువులు కోరుతున్నారు.

మరణ వేదన

- ప్రమాదాలకు నిలయంగా అద్దంకి నార్కట్‌పల్లి రోడ్డు
- బెంబేలెత్తుతున్న వాహనదారులు, పాదచారులు
- నకరికల్లుతోపాటు పలుచోట్ల డేంజర్ స్పాట్లు



అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతం

నకరికల్లు: అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ దారిలో పలుచోట్ల డేంజర్ స్పాట్లు అందరినీ భయపెడుతున్నాయి. తరచూ ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతుండడంతో ఎంతోమంది క్షతగాత్రులవుతున్నారు. నకరికల్లు మండలంలోని త్రిపురాపురం నుంచి అడ్డరోడ్డు గ్రామాల మధ్యన 10 కిలోమీటర్ల మేర ఈ రహదారి విస్తరించి ఉంది. చెన్నై-హైదరాబాద్ మధ్య ఉన్న రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నకరికల్లులో పాత టీవీఎస్ షోరూం నుంచి వై జంక్షన్ వరకు ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. దీనిపై భారీ వాహనాలు, దూరప్రాంతాలకు వెళ్లే వాహనాలు అతి వేగంగా రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారికి రెండువైపులా గ్రామం విస్తరించి ఉంది. రోడ్డుకు ఒకవైపు నుంచి మరోవైపునకు వెళ్లేందుకు అండర్ పాస్‌ను సెంటర్‌కు దూరంగా ఏర్పాటు చేశారు. అండర్‌పాస్ ద్వారా నడిచి వెళ్లేందుకు దూరంకావడంతో పాదచారులు బ్రిడ్జి ఎక్కి రోడ్డు దాటుతుంటారు. ఈ క్రమంలోనే పిడుగురాళ్ల, నరసరావుపేట వైపు వెళ్లేందుకు బస్టాప్‌లకు వెళ్లేవారు, బ్యాంకులు, పోస్టాఫీసు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే వారు రహదారిపై నడుచుకుంటూ దాటి వెళ్తున్నారు. అలాగే ప్రధానసెంటర్‌లో మలుపు కూడా ప్రమాదకరంగా మారింది. ప్రమాద హెచ్చరిక బోర్డులు గానీ, జీబ్రాలైన్స్ గానీ ఏర్పాటు చేయలేదు. దీంతో అతివేగంగా వచ్చే వాహనాలతో పాదచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నెలలో కనీసం 10కిపైగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి నిర్మించిన నాటి నుంచి ఇప్పటివరకు ఈ దారిలో జరిగిన ప్రమాదాల్లో 15 మందికి పైగా మరణించారు. క్షతగాత్రుల సంఖ్య వందకుపైగానే ఉంది.



పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో ధ్వంసమైన కారు

ఫుట్ ఓవర్ బ్రిడ్జితోనే ప్రమాదాల నివారణ

నకరికల్లులోని ప్రధాన సెంటర్‌లోని మలుపు వద్ద అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై పాతూరు వెళ్లే రోడ్డును, బ్యాంకు బజార్‌రోడ్డును కలిపేలా ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తే రోడ్డుకు ఇరువైపులా రాకపోకలు సాగించే పాదచారులకు ఉపయోగకరంగా ఉంటుంది. దీనివల్ల ప్రమాదాలను పూర్తిగా అరికట్టవచ్చని స్థానికులు చెబుతున్నారు. దీనిపై పలువురు ప్రజాసంఘాల నాయకులూ పలుమార్లు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించడం లేదు.

ప్రమాదాలు ఇలా..

- అక్టోబర్ 18న నర్సింగపాడుకు చెందిన పి.సుబ్బయ్య మోటార్‌సైకిల్ ఢీకొని మృతి చెందాడు.
- గత నెలలో అడ్డరోడ్డులోని బాలాజీ డెయిరీ వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ట్రాక్టర్‌ను ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మరణించాడు.
- నరసరావుపేట బస్టాప్ వద్ద రామకృష్ణ అనే వ్యక్తి గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు.
- ఆదివారం పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి వద్ద కారు అదుపు తప్పిన ప్రమాదంలో ఐదుగురు మృతిచెందారు.

మంట కలసిన మానవత్వం

"మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు.." అని ఓ కవి రాసిన గేయం సమాజంలో నెలకొన్న పరిస్థితులకు అద్దం పడుతోంది.

- సైకిల్‌పై వెళుతున్న వృద్ధుడిని ఢీకొన్న టిప్పర్
- ప్రాణాపాయంలో కొట్టుకుంటున్న పట్టించుకోని జనం
- చివరకు ప్రాణాలు విడిచిన వృద్ధుడు



రోడ్డుపై పడి ఉన్న వృద్ధుడిని పట్టించుకోకుండా వెళ్తున్న జనం

పర్చూరు (చినగంజాం): సాంకేతికంగా ప్రపంచం అభివృద్ధి చెంది ముందుకు వెళ్తుంటే మనుషుల్లో ఉండే మానవత్వం మాత్రం మంట కలిసిపోతోంది. ఇందుకు ఆదివారం పర్చూరు రహదారి పరిధిలో చోటు చేసుకున్న ఓ హృదయ విదారక ఘటన ప్రత్యక్ష ఉదాహణ. ఇంకొల్లు గ్రామానికి చెందిన తూమాటి సుబ్బయ్య ఇరిగేషన్ శాఖలో లస్కర్‌గా పనిచేసి రిటైర్ అయ్యాడు. భార్య చనిపోవడంతో పర్చూరులో ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. నాగులపాలెంలోని ఓ ప్రైవేట్ స్కూలు వాచ్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. విధులు ముగించుకొని సైకిల్‌పై ఇంటికి వెళుతున్న సమయంలో వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. వృద్ధుడు రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న జనం ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయకుండా మిన్నకుండిపోయారు. కొద్దిసేపటి వరకు ప్రాణాలతో కొట్టుమిట్టాడి మృతి చెందాడు. కనీసం మృతి చెందిన అతనిని రోడ్డు పక్కకు చేర్చడం, పోలీసులకు సమాచారం ఇవ్వడం కూడా చేయలేక పోయారు. అతడు ప్రాణాలు వదలి గంటలు గడుస్తున్నా ఎవ్వరూ పట్టించుకోనప్పటికీ కుక్కలు అతని మృతదేహం వద్దే కూర్చున్నాయి. ఇది పలువురి మనసులను కదలించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి కుక్కలను దూరంగా తరిమి శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని తీసుకెళ్లారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు కొప్పరపాడు విద్యార్థి ఎంపిక



బల్లికురవ: జిల్లాస్థాయిలో జరిగిన కౌశల్ 2024 క్విజ్‌పోటీ పరీక్షలో కొప్పరపాడు ఉన్నత పాఠశాల విద్యార్థి బత్తుల అభిరామ్, మొదటి ర్యాంకు సాధించినట్లు హెచ్‌ఎం పీ.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ నెల 6న ఆన్‌లైన్ ద్వారా జరిగిన ఈ పరీక్షకు పదో తరగతి విభాగంలో అభిరామ్ మొదటి ర్యాంకు సాధించినట్లు చెప్పారు. ఈ నెల 29, 30 తేదీలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అభిరామ్ ఎంపికై నట్లు హెచ్‌ఎం తెలిపారు.

కుట్లు వేయడంపై వైద్య విద్యార్థులకు వర్క్‌షాప్



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో పీజీ వైద్య విద్యార్థులకు, జూనియర్ వైద్యులకు ఆపరేషన్ల అనంతరం కుట్లు వేసే విధానంపై (సూచరింగ్ టెక్నిక్స్) వర్క్‌షాప్ నిర్వహించారు. జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ యతికాన్ సూచరింగ్ టెక్నిక్స్ పేరుతో నిర్వహించిన వర్క్ షాప్‌ను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీజీ వైద్య విద్యార్థులకు పొట్టకు, కాలికి, చేతికి, ముఖంపై కుట్లు వేసే సమయంలో తీసుకోవాల్సిన టెక్నిక్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఏర్పాటు చేసిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. వైద్య విద్యార్థులు నేర్చుకునేందుకు ఏసీ బస్సులో పది వర్కింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారని, నాలుగు రోజులపాటు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వర్క్‌షాప్ జరుగుతుందని చెప్పారు. నాలెడ్జ్ ఆన్ వీల్ నినాదంతో బస్సులో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో ల్యాప్రోస్కోపిక్ సర్జరీ సమయంలో ఏవిధంగా కుట్లు వేయాలనే విషయాలను వైద్య విద్యార్థులకు వివరిస్తారని చెప్పారు. పీజీ వైద్యులతోపాటు, జూనియర్ వైద్యులు కూడా సూచరింగ్ టెక్నిక్స్ నేర్చుకుని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని వారు కోరారు.



ట్రోఫీని అందుకుంటున్న చీరాల సెయింటాన్స్ కళాశాల జట్టు



జేఎన్‌టీయూకే పురుషుల వాలీబాల్ జట్టు

విజేత చీరాల సెయింట్ ఆన్స్ కళాశాల

- ముగిసిన జేఎన్‌టీయూకే సెంట్రల్‌జోన్ వాలీబాల్ పోటీలు
- రన్నరప్‌గా ప్రగతి కళాశాల (సూరంపాలెం)
- వర్సిటీ వాలీబాల్ జట్టు ఎంపిక

నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూకే సెంట్రల్‌జోన్ అంతర కళాశాలల పురుషుల వాలీబాల్ పోటీలలో విజేతగా చీరాల సెయింట్ ఆన్స్ నిలిచింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోటీలో ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల (సూరంపాలెం) జట్టుపై విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది. రెండు రోజుల పాటు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన సెంట్రల్‌జోన్ వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. పోటీలలో జేఎన్‌టీయూకే పరిధిలోని ఐదు జిల్లాల నుంచి 38 జట్లు పాల్గొన్నాయి. సోమవారం సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించారు. కాకినాడ జిల్లా సూరంపాలెంకు చెందిన ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, చీరాల సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాల, విజయవాడ పీవీపీ ఎస్ఐటీ కళాశాల జట్లు సెమీఫైనల్‌కు చేరాయి. హోరాహోరీగా సాగిన మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో సూరంపాలెంకు చెందిన రెండు కళాశాలల జట్లు తలపడగా ఆదిత్య కళాశాలపై ప్రగతి కళాశాల జట్టు విజయం సాధించి ఫైనల్ చేరింది. మరో సెమీఫైనల్ మ్యాచ్‌లో చీరాల సెయింటాన్స్ జట్టు విజయవాడ పీవీపీఎస్ఐటీ కళాశాల జట్టుపై సునాయసంగా విజయం సాధించి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఫైనల్ పోటీలో విజయం సాధించడం ద్వారా సెంట్రల్‌జోన్ పోటీలలో చీరాల సెయింట్ ఆన్స్ జట్టు హ్యాట్రిక్ గెలుపు అందుకుంది.

బహుమతి ప్రదానోత్సవం

అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేఎన్‌టీయూకే స్పోర్ట్స్ బోర్డు కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ శ్యామ్ కుమార్, జేఎన్‌టీయూకె ఐసీటీ సెక్రటరీ డాక్టర్ జీపీ రాజు, ఎన్ఈసీ కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు పాల్గొన్నారు. విజేత సెయింట్ ఆన్స్ కళాశాల జట్టుకు విన్నర్స్ ట్రోఫీ, ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలకు రన్నరప్ ట్రోఫీని అందజేశారు. అలాగే తృతీయ బహుమతిని పీవీపీఎస్ఐటి కళాశాల జట్టుకు, నాలుగో బహుమతిని ఆదిత్య కళాశాల జట్టుకు అతిథులు అందించారు. అనంతరం పోటీలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను వర్సిటీ పురుషుల వాలీబాల్ జట్టుకు ఎంపిక చేశారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా ఎ.రామచంద్రరాజు, కె.వెంకట్రావు వ్యవహరించారు. కార్యక్రమంలో ఎన్ఈసీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్కు కృష్ణారెడ్డి, వ్యాయామ అధ్యాపకులు ఆంజనేయులు, విజయ కుమార్ పాల్గొన్నారు.

వర్సిటీ జట్టు సభ్యులు వీరే..

సిహెచ్.వంశీకృష్ణ(పీవీపీఎస్ఐటి, విజయవాడ), ఎం.వెంకటేష్ (ఎన్ఈసీ నరసరావుపేట), డిరాజమౌళి(కేకేఆర్అండ్‌కేఎస్ఆర్, గుంటూరు), వి.నూకరాజు(యూసీఈకే కాకినాడ), వి.మోహనరావు (యూసీఈఎన్, నరసరావుపేట), ఆర్.వరుణ్‌సందేశ్(ఆదిత్య కళాశాల, సూరంపాలెం), జి.తేజ(సెయింటాన్స్ కళాశాల,చీరాల), డి.అవినాష్(ప్రగతి కళాశాల, సూరంపాలెం), ఆర్.రమణ(సెయింటాన్స్ కళాశాల, చీరాల), కె.నవీన్(విజ్ఞాన్ లారా కళాశాల, గుంటూరు)ఎం.శామ్యూల్(ఎంఐసీ, కంచికచర్ల), డి.బుజ్జిబాబు(ప్రగతి కళాశాల, సూరంపాలెం) జట్టు సభ్యులుగా ఎంపికయ్యారు. మరో ఐదుగురు స్టాండ్‌బైగా ఎంపికయ్యారు.

భూముల దస్త్రాలన్నీ పరిశీలించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూముల దస్త్రాలన్నీ అధికారులు పునఃపరిశీలన చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. రెవెన్యూ అంశాలపై ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్ష సమావేశం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. నిషేధిత భూముల జాబితా నుంచి 3,034 ఎకరాలు తొలగించగా ఇప్పటివరకు 2,500 ఎకరాలను పరిశీలించినట్లు చెప్పారు. మూడు రోజుల్లో పరిశీలన ప్రక్రియ ముగించాలన్నారు. పీజీఆర్ఎస్ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతతో పరిష్కరించాలని చెప్పారు. 8 మండలాలలో అర్జీలు పెండింగ్‌లో ఉండడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ప్రతి సోమవారం అన్ని మండల కేంద్రాలలో పీజీఆర్ఎస్ జరగాలన్నారు.

పంట కోతలు నిలిపివేయండి

భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో ఈనెల 10, 11, 12 తేదీలలో వరి పంట కోతలు నిలిపివేయాలని రైతులకు కలెక్టర్ సూచించారు. వరి కోత యంత్రాలు నడపరాదని, ఈ మూడు రోజులలో యంత్రాలు నడిపితే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు.

11న నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

నీటి సంఘాల ఎన్నికలకు ఈనెల 11వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయాలని కలెక్టర్ చెప్పారు. 14వ తేదీన టీసీలకు ఎన్నికలు జరుగుతాయని, 17వ తేదీన డిస్ట్రిబ్యూటరీ కమిటీకి ఎన్నికలు నిర్వహించాలన్నారు.

1970 మంది ఆధార్ కార్డులు జారీ

ఆధార్ కార్డులు లేనివారు 2,850 మందిని గుర్తించగా, ప్రత్యేక డ్రైవ్ ద్వారా 1,970 మందికి ఆధార్ ఇవ్వడంపై సమీక్షించారు. మిగిలినవి త్వరలో పూర్తి చేయాలన్నారు. ఆధార్ కార్డులు వచ్చిన వారికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వర్తింపజేయాలని సూచించారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారం లక్ష్యం

రెవెన్యూ సమస్యలు, భూ వివాదాలు లేని గ్రామంగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. రెవెన్యూ సదస్సులను సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. ఏ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారో ఆ గ్రామంలోనే రాజకీయ నాయకులు, రైతు సంఘాలు, రైతు ఉత్పత్తి సంఘాలు, ఎన్జీవోలను కలుపుకుని ముందస్తుగా విస్తత ప్రచారం చేయాలన్నారు.

నీటి తీరువ వసూలుపై దృష్టి

నీటి తీరువా పన్నులు లక్ష్యం మేరకు వసూలు చేయాలని కలెక్టర్ ఉద్యోగులు ఆదేశించారు. జిల్లాలో రూ.13.45 కోట్లు డిమాండ్ ఉండగా వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీఆర్వోల ద్వారా వసూలు ప్రక్రియ వేగంగా చేపట్టాలని, ఇందుకోసం తహసీల్దార్లు రైతులను చైతన్య పరచాలన్నారు. ఆర్డీవోల పర్యవేక్షణ నిరంతరం ఉండాలని ఆదేశించారు.

థియేటర్ల లైసెన్స్‌లపై ఆరా

జిల్లా వ్యాప్తంగా 35 సినిమా థియేటర్లు ఉండగా, 16 థియేటర్లకు మాత్రమే లైసెన్స్ ఉండడంపై ఆరా తీశారు. తక్షణమే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. పది రోజులలో తహసీల్దార్ల పని తీరులో పురోగతి కనిపించాలని అన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్‌గౌడ్, బాపట్ల, రేపల్లె ఆర్డీవోలు పి గ్లోరియా, రామలక్ష్మి, కెఆర్‌ఆర్‌సీ ఎస్ డి సి లవన్న, కలెక్టరేట్ ఏఓ సీతారత్నం, తహసీల్దార్లు పాల్గొన్నారు.

అర్జీలు పునరావృతం కాకుండా చూడండి

ఎస్పీ తుషార్ డూడీ



ప్రజా సమస్యల పరిష్కార వేదికల్లో అర్జీలు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల: అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. తమ సమస్యలను చెప్పుకోవడానికి జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన అర్జీదారుల సమస్యలను ఎస్పీ స్వయంగా విని, వారు ఇచ్చిన అర్జీలను పరిశీలించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అర్జీదారుల సమస్యలను చట్ట పరిధిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. వివిధ సమస్యలతో పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు భరోసాగా పోలీస్ శాఖ ఉండాలన్నారు. సమస్యలను చట్ట పరిధిలో విచారించి పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా పూర్తిస్థాయిలో విచారించి శాశ్వతంగా పరిష్కారం చూపాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. మొత్తం 37 మంది అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, పి.జి.ఆర్.ఎస్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీస్ బందోబస్తు మధ్య సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం



ఐలవరం దళితవాడలో రహదారి నిర్మాణం పనుల్లో భాగంగా విచ్చేసిన పోలీసులు

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం దళితవాడలో సోమవారం పోలీస్ బందోబస్తు, మండల అధికార యంత్రాంగం సమక్షంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక దళితవాడలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పక్కనే ఉన్న కమ్యూనిటీ స్థలంలో కొంత మంది వ్యక్తుల కోసం రహదారి ఏర్పాటు చేయడంపై 2016 నుంచి స్థానిక సంఘం ఆక్షేపణ వ్యక్తం చేస్తుంది. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఆ స్థలంలో రహదారి నిర్మాణానికి 2021లో తీర్మానం చేసింది. దీనిపై సంబంధిత వ్యక్తులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు సోమవారం మండల యంత్రాంగం, పోలీస్ అధికారులు ఐలవరం విచ్చేసి రహదారి నిర్మాణానికి జరుగుతున్న కీ వాల్ పనులను చేయించారు. తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎస్ వెంకటరమణ, వేమూరు సీఐ పి.వీరాంజనేయులు, కొల్లూరు, వేమూరు, భట్టిప్రోలు ఎస్ఐలు ఏడుకొండలు, రవికృష్ణ, ఎం.శివయ్య, పంచాయతీరాజ్ ఏఈ శేతు రామచంద్రరరావు, కార్యదర్శి ఎం.కోటేశ్వరరావు, వీఆర్వో లక్ష్మి, వివిధ శాఖల సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కమ్యూనిటీ స్థలంలో అందరికి అనుకూలంగా ఉండే భవనం కానీ, పిల్లల ఆటలాడుకునేందుకు ప్లే గ్రౌండ్ కానీ వేయకుండా రోడ్డు వేయడం పట్ల స్థానికులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు రహదారి నిర్మాణం పనులు చేయించేందుకు విచ్చేసినట్లు అధికారులు తెలిపారు.

ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ



ఎక్సైజ్ స్టేషన్ రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా సూపరింటెండెంట్ బి వెంకటేశ్వర్లు


వేమూరు: ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు మద్యం షాపుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సాధించాలని బాపట్ల జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి వెంకటేశ్వర్లు అన్నారు. వేమూరులోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆయన సోమవారం తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేమూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 12 మద్యం షాపులు నిర్వహిస్తున్నారని, మద్యం షాపులపై ప్రత్యేక నిఘా ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు షాపులు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసిందని, బెల్టు షాపుల గురించి మా దృష్టికి వస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐ రవికుమార్, ఎస్ఐ శ్రీకాంత్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అర్చకుడు మృతి



అద్దంకి రూరల్: రోడ్డు ప్రమాదంలో శింగరకొండ దేవస్థాన రిటైర్డు అర్చకుడు మృతి చెందిన ఘటన సోమవారం అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్సై ఖాదర్‌బాషా వివరాల మేరకు.. శింగరకొండకు చెందిన కోట శ్రీరామచంద్రమూర్తి (72) ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ఆంజనేయ దేవస్థానంలో అర్చకుడిగా పనిచేసి ఉద్యోగవిరమణ చేశాడు. ఈనేపథ్యంలో సోమవారం పని నిమిత్తం అద్దంకికి స్కూటర్ మీద వచ్చి వెళ్తున్నాడు. ఈ క్రమంలో స్థానిక పోతురాజు గండి సమీపంలోకి రాగానే లారీ ఢీకొట్టటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు శ్రీరామమూర్తికి రామకృష్ణ, కిషోర్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు కూడా దేవస్థానంలో అర్చకులుగా పని చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం పోలీసులు లారీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

బైక్ అదుపుతప్పి పడి యువకుడి మృతి



కర్లపాలెం: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో ఓ యువకుడికి తీవ్రగాయాలై మృతి చెందిన సంఘటన మండల పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. కర్లపాలెం ఎస్ఐ ఎ.రవీంద్ర తెలిపిన వివరాల ప్రకారం... కర్లపాలెం మండలం కొత్త నందాయపాలెం గ్రామానికి చెందిన శవనం చందు గోపిరెడ్డి(22) సోమవారం ద్విచక్రవాహనంపై తన స్నేహితుడిని తెల్లవారుజామున పేరలి గ్రామంలో దించి తిరిగి కర్లపాలెం వస్తుండగా పెదగొల్లపాలెం అడ్డరోడ్డు దాటిన తరువాత ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడటంతో చందుగోపిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి తండ్రి బాలకృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రాష్ట్ర పోటీలకు జిల్లా టీటీ జట్టు ఎంపిక

గుంటూరువెస్ట్(క్రీడలు): కాకినాడలో ఈ నెల 20 నుంచి 22 వరకు జరగనున్న రాష్ట్ర టేబుల్ టెన్నిస్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు గర్తపురి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నడింపల్లి వెంకట గురుదత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం వివిధ వయస్సుల వారికి నిర్వహించిన పోటీల్లో ప్రతిభకనబరచిన వారిని ఎంపిక చేశామని పేర్కొన్నారు.

ఎంపికైన వారి వివరాలు

పురుషులు–పి.తులసీరామ్, వై.ప్రభుసాయి, కె.రాజేష్, పి.యశ్వంత్ సాయి, పి.రఫీ **మహిళలు**– పి.హాసిని, కె.సుదీక్షిత, రఫీ మున్నిసా, రుష్మా ఫెర్నోష్ ఫిర్దోస్, మోక్షిత్ రెడ్డి **బాలురు**– యశ్వంత్ సాయి, కృష్ణ మనోహర్, రుత్విక్, సమన్మయ్, దుర్గా నాగ వెంకట్ **బాలికలు**– శాన్వి సుధాకర్, ఎస్‌కే షరీషా, సీహెచ్ యోగితా కృష్ణ, కె.సంజన

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

వివరాలు వెల్లడించిన డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని అయ్యప్ప భక్తులు శబరిమల వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లను కేటాయించినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ తెలిపారు.

- రైలు నంబర్ 07167 (మౌలాలి–కొట్టాయం) వయా గుంటూరు డివిజన్ మీదుగా 2025 జనవరి 3,10,17,24,31వ తేదీల్లో నడుస్తుందని పేర్కొన్నారు. మౌలాలి స్టేషన్ నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరి కొట్టాయం స్టేషన్‌కు మరుసటి రోజు సాయంత్రం 6.45 గంటలకు చేరుకుంటుంది.
- రైలు నంబర్ 07168 (కొట్టాయం–సికింద్రాబాద్) జనవరి 4,11,18,25,ఫిబ్రవరి 1వ తేదీల్లో ప్రయాణిస్తుంది. ఈ రైలు కొట్టాయం స్టేషన్ నుంచి రాత్రి 9.45 గంటలకు బయలుదేరి సికింద్రాబాద్ స్టేషన్‌కు మరుసటి రెండో రోజు రాత్రి 1.30 గంటలకు చేరుకుంటుంది. చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కట్‌పడి, జొలార్‌పట్టి, సేలం, ఈరోడ్, త్రిపూరా, కోయంబత్తూర్, పల్‌కాడ్, త్రిసూర్, ఆలువా, ఎర్నాకులం మీదుగా ప్రయాణిస్తుంది.
- రైలు నంబర్ 07169 (కాచిగూడ–కొట్టాయం) జనవరి 5,12,19,26వ తేదీల్లో నడుస్తుందని తెలిపారు. కాచిగూడ స్టేషన్ నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి రెండో రోజు రాత్రి 6.50 గంటలకు కొట్టాయం స్టేషన్‌కు చేరుకుంటుంది.
- రైలు నంబర్ 07170 (కొట్టాయం–కాచిగూడ) జనవరి 6,13,20,27 తేదీల్లో నడుస్తుంది. కొట్టాయం స్టేషన్ నుంచి రాత్రి 8.50 గంటలకు బయలుదేరి కాచిగూడ స్టేషన్ రెండో రోజు రాత్రి 1 గంటకు చేరుకుంటుంది. మల్కాజ్‌గిరి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్‌పడి, జొలార్‌పట్టి, సేలం, ఈరోడ్, త్రిపూరా, కోయంబత్తూర్, పల్‌కాడ్, త్రిసూర్, ఆలువా, ఎర్నాకులం, మీదుగా ప్రయాణిస్తుంది.

నేడు గుంటూరులో 'పడమటి గాలి' హోరు

- సంచలనం సృష్టించిన నాటకం 153వ ప్రదర్శన
- కరోనా పరిస్థితుల తర్వాత మళ్లీ ప్రేక్షకుల ముందుకు
- కన్యాశుల్కం తర్వాత అంత గొప్ప నాటకంగా ప్రశంసలు
- పల్లెటూరు పరాయీకరణంపై జనరంజక నాటకం



పడమటి గాలి నాటకంలో ఓ సన్నివేశం

తెనాలి: పడమటి గాలి...తెలుగు నాటకరంగంలో సంచలనం సృష్టించిన నాటకం. ఒకనాటి కన్యాశుల్కం, ఆ తర్వాత మాభూమిలా ఈనాటి 'పడమటి గాలి' ఆంధ్రుల ఇతివృత్తాలకు, సామాజిక చైతన్యానికి కొలమానంగా నిలిచింది. చరిత్రలో నిలిచిపోయే సామాజిక నాటకం. కరోనా విపత్కర పరిస్థితుల తర్వాత 153వ ప్రదర్శనగా ప్రేక్షకుల ముందుకొస్తోంది...అది కూడా సంక్షిప్తరూపంలో. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య కళావేదికపై మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు పండు క్రియేషన్స్, కొప్పోలు సమాజం ప్రదర్శిస్తున్నారు. గుంటూరు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రారంభిస్తారు.

పల్లె గుండె చప్పుడు

సముద్రాల కవతల ఒక బహుళజాతి కంపెనీ మెదడులో ఓ కొత్త వ్యాపారపు ఆలోచన మెరిసింది. దేశంలోని ఓ మారుమూల పల్లె తల్లి గుండె చప్పుడు మారిపోతుంది...చేను చెంప చెమ్మగిల్లుతుంది. అటువంటి 'పడమటి గాలి' సోకిన ప్రకాశం జిల్లాలోని మారుమూల పల్లెటూరి వృత్తాంతమే ఈ నాటకం. ఆర్థిక సరళీకృత విధానాలు, ప్రపంచీకరణ పెనుమాయలో పల్లెటూళ్లు ఎలా కకావికలమవుతుందీ కళ్లకు కట్టిందీ నాటకం. నగరాల్లోని విషసంస్కృతి, విలాసాల జీవితలాలస పల్లెపైకి పంజా విసరటం, స్పీడ్‌మనీ, ఈజీమనీ మనుషులను పిచ్చివాళ్లను చేయటమే కాదు... ప్రేమానురాగాల మధ్య మెలగాల్సిన మనిషి కలుషితమై వికృతత్వాన్ని పొందుతాడు. మట్టితోనూ, చెట్టుతోనూ సజీవ సంబంధం కలిగిన రైతు, ఆ మట్టితో తన సహజత్వాన్నీ, అస్తిత్వాన్నీ, వ్యక్తిత్వాన్నీ నిలుపుకోవాలని అనుకుంటాడు. పడమటి గాలి నాటకం ఇతివృత్తం సంక్షిప్తంగా ఇదే.

నాటకం ప్రత్యేకతలు

నాలుగున్నర గంటల సుదీర్ఘమైన ఈ నాటకంలో 14 జిల్లాలకు చెందిన 70 మంది కళాకారులు నటించటం ఒక ప్రత్యేకత. ఆట, పాట, పద్యం లేకుండా ప్రేక్షకుడిని ఉత్కంఠభరితంగా చూసేలా చేసిన నాటకంగా ఇప్పటికే పేరుతెచ్చుకుంది. మొత్తం 13 దృశ్యాలు. పురాతన సురభి పద్ధతుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మేళవించి ప్రదర్శించటం మరో విశేషం! పోటీ నాటకాలకు భిన్నంగా ప్రజల జీవితాన్ని జనరంజకంగా, అదికూడా గ్రామీణ వాడుక భాషను యథాతథంగా రచించి రక్తికట్టించటం గొప్ప అంశం. ఐఏఎస్, డిప్యూటీ సెక్రటరీ, సీఐ సహా పదిమంది ప్రభుత్వ అధికారులు నటించిన నాటకం. ఇదే నాటకంపై యూనివర్సిటీల్లో పరిశోధనలు జరిగాయి. వేమన యూనివర్సిటీ ఎంఏ ఫైనలియర్ విద్యార్థులకు పాఠ్య గ్రంథంగా నిర్ణయించింది.

ఫీజు రీయింబర్స్‌మెంటును వెంటనే విడుదల చేయాలి



జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

లక్ష్మీపురం: రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటును విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి, కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. యశ్వంత్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ ఇంజనీరింగ్ పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.2100 కోట్లు, వసతి దీవెన రూ.1400 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులకు కోర్సులు అయిపోయినప్పటికీ సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాల యాజమాన్యాలు అభ్యంతరం చెబుతున్నాయని, తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వచ్చే నెల నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్ పరీక్షలు మొదలవుతున్నాయని, ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతి ఇస్తామని కళాశాల యాజమాన్యాలు తెలియజేస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు విడుదల చేయాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శివ, జిల్లా సహాయ కార్యదర్శి అమరనాథ్, నగర కార్యదర్శి సాయి, ప్రతిపాడు నియోజకవర్గ అధ్యక్షులు డేవిడ్ నగర ఉపాధ్యక్షులు సాగర్, నగర సహాయ కార్యదర్శి వెంకట్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గౌతమ్, నితిన్, ఆనంద్, అంకమరావు, అజయ్, ప్రభాస్, చరణ్ పాల్గొన్నారు.